మనిషి బొమ్మ

ఇచ్ఛాపురపు రామచంద్రం



ఇంక్రిమెంటు కాగితం అందుకున్న గోపాలం కళ్ళు ఒక్కసారి ఆనందంతో మెరిశాయ్.

ఉద్యోగంలో ప్రవేశించాక యిది మొదటి యింక్రిమెంటు.

జీతంలో నాలుగురూపాయల పెరుగుదల!

నాలుగురూపాయలు! ప్రతినెలా అదనంగా నాలుగురూపాయలు!! సంవత్సరం పైగా పడిన శ్రమకు ప్రతిఫలం లభించింది. ఉద్యోగ జీవితపు సోపానాల్లో తనొకటి అధిరోహించగలిగాడు.

గోపాలం కళ్ళల్లో కొంచం గర్వంతో కూడిన తృప్తి నిండింది.

మరొక్కసారి యింక్రిమెంటు కాగితాన్ని సాకల్యంగా చదువుకుని చొక్కా జేబులో దాచుకుని—ఎదురుగా కనిపించిన ఫైలునందుకోబోయి కూడా ఆగిపోయాడు.

ఆఫీసు నిశ్శబ్దంగా ఉంది. లంచ్ టైము దాటిపోతున్నా ఎవరూ సీట్లు చేరుకోలేదు. ఆఫీసరు శలవుపెట్టడాన ఆఫీసుకి దాదాపు ఆటవిడుపు. అందుచేత గుమాస్తాలెవరూ త్వరగా వస్తారన్న నమ్మకంలేదు.

కొద్ది నిముషాలపాటు సంతోషం కలిగించే ఆలోచనలలో విహరించాలనిపించిందతనికి

'నాకు ఇంక్రిమెంటు వచ్చింది నాన్నా!' అని ఉత్సాహంగా తండ్రికి చెప్పాలనిపించింది. కాని—మరుక్షణం బాధగా గుర్తుచేసుకున్నాడు—

తను...తన ఊరికీ, తన యింటికీ, తనవారికీ నూటయాభై మైళ్ళదూరంలో ఉన్నాడని. తక్షణం అతని ఉద్రేకం చల్లారిపోయింది. ఉత్సాహం దిగజారిపోయింది.

ఉద్యోగంకోసం ...ఉదరపోషణకోసం ... తను యింటినుంచి చాలాదూరంగా ఉంటున్నాడు ఇక్కడ—

అమ్మలేదు—ఆప్యాయతలేదు.

నాన్నలేదు—వాత్సల్యంలేదు.

తమ్ముడూ చెల్లెలూలేరు; అనురాగమూ అభిమానమూలేవు. ఉన్నదల్లా ఒక్కటే. ఉద్యోగం!

అమ్మని చూడాలని ఉంది—ఆమెపెట్టే అమృతప్రాయమైన భోజనం తినాలని ఉంది. నాన్నని చూడాలని ఉంది. ఆయన

మాటలువింటూ. సేదతీరాలనిఉంది. తమ్ముడికి ధర్డ్‌ఫారం పాఠాలు చెప్పాలనుంది. చెల్లెల్ని ప్రేమగా లాలించాలని ఉంది.

ఈ కోరికలన్నీ యుగానాటివికావు. కొన్ని నెలల నాటివి.

స్వర్గంవంటి యింటిని తలుచుకుంటే ఉద్యోగం వదిలి పారిపోవాలనిపిస్తుంది. ఏవో సౌఖ్యాలు తనని ఊరిస్తూ ఆవంక పిలుస్తాయ్. తన మనసు అటువైపు మొగ్గే అంతలో...ఏదో అదృశ్యబంధం అడ్డు నిలుస్తుంది. మనసుకే తప్ప కంటికి తోచని ఆబంధంఏమిటి? బాధ్యతా? నాన్న ఉపదేశం గుర్తుకొచ్చి—అపరిపక్వమైన తన మెదడులో కర్తవ్యం అధికారం చెలాయిస్తుంది.

ఉద్యోగం వినా జీవితం కనులముందు కొరడా ఝుళిపిస్తుంది.

ఊహలో మెదిలే భవిష్యత్తులోని భయంకరత్వాన్ని భరించలేక మెదడుకి మనసుకీ కళ్ళాలువేసుకుని— తను మళ్ళీ మామూలు గోపాలం—గుమాస్తా గోపాలం ఐపోతాడు. ఆత్మీయులంతా తన చుట్టూ ఉన్నట్లే ఊహించుకుని హృదయాన్ని మభ్యపెట్టుకుంటాడు.

'ఇవాళ గోపాలానికి—ఇంక్రిమెంట్ వచ్చింది. మొట్టమొదటిది కనుక కాఫీలు తెప్పించమనాలి.'

ఆమాటలు విని—పక్కగదిలోకి గుమాస్తాలు చేరుకున్నారని గ్రహించాడు గోపాలం. ఎదురుగా ఉన్న ఫైలందుకుని దానిలోకి చూస్తూ కూర్చున్నాడు.

'గోపాలంచేత కాఫీలు తెప్పించగలిగితే రెండు రూపాయలు పందెం'!

'మై డియర్ వేణూ, కొత్తగావచ్చావు కనుక నీకు గోపాలం సంగతి తెలియదు. గోపాలమంటే ఎవరనుకున్నావ్? తోటి గుమాస్తాకి పెళ్ళికానుక కొందామంటే ఐదురూపాయలు చందా యివ్వని అపరషైలాక్! అతనే కనుక ఆఫీసుకి కాఫీలిస్తే అష్టగ్రహకూటమి మళ్ళీ తప్పదు!'

'మరీ అంత అన్యాయంగా మాట్లాడకు శంకరం. ఎంతయినా అతనూ మన తోటి గుమస్తాయేకద? సరదాగా అడిగి చూస్తే తప్పేముంది?'

'అబ్బే. తప్పేమీలేదు. అతనుకాదన్నాక మొహం మార్చుకోకుండా వచ్చెయ్. ఒకటి మాత్రం పచ్చి నిజం. గోపాలంచేత కాఫీలు తెప్పించడం నీతరం కాదుకదా నిన్ను పుట్టించిన బ్రహ్మతరంకూడాకాదు. గోపాలం అంటే సాక్షాత్తూ లుబ్ధావధానులు.' నవ్వేడు శంకరం.

'ఆఫీసులో ఉన్నది అంతా కలిపి యిరవైమంది. మనం అడిగేది కేవలం కాఫీయేగాని పార్టీ కాదు. కనుక నాలుగు రూపాయలకంటే ఖర్చుకాదు.'

నాలుగు రూపాయలు! ఆఫీసులో కాఫీలకోసం !!

గోపాలం గుండెలు దడదడలాడేయ్. ఒక్కసారి జేబులోకి చెయ్యిపెట్టుకుని చూసుకున్నాడు. ఇంక్రిమెంట్ కాగితం మృదువుగా తగిలింది.

తను సంవత్సరం శ్రమపడి సాధించేడీ ఫలితాన్ని. కష్టపడినది తను. ఫలితం సాధించింది తను మధ్య వీళ్ళకెందుకు కాఫీ లివ్వాలి? ఏమైనాసరే చూస్తూ చూస్తూ కాఫీలకోసం నాలుగు రూపాయలు తను ఖర్చుపెట్టలేడు.

గోపాలం గుండె దిటవు చేసుకుని మళ్ళీ ఫైలులోకి చూడసాగాడు.

'అతను మనకి కాఫీలూ యివ్వొద్దు, గీఫీలూ యివ్వొద్దు. ఆ కుళ్ళుగుడ్డలు వదిలేసి ఆఫీసుకి శుభ్రమైన గుడ్డలు కట్టుకు వస్తే అదే పదివేలు. ఆ కంపు గుడ్డలు భరించలేక ఛస్తున్నాం.'

'నిజమే వేణూ! ఈ రోజుల్లో ప్యూన్లు కూడా టెరిలిన్లే వేసుకుంటున్నారు. అప్పారావూ సింహాచలమూ చూడు ఎంత నీటుగా ఉంటారో.? గోపాలం మనలాటి గుమాస్తా అనుకునేందుకు కూడా సిగ్గు సిగ్గు.'

ఎప్పుడూ ఖరీదైన దుస్తులే ధరించే సుందరం గొంతు.

గోపాలం హృదయం బాధగా మూలిగింది.

తను వేసుకునే బట్టలు అతిసాధారణమైనవే కాని అపరిశుభ్రమైనవి మాత్రం కావు. కానీ — అప్పారావూ సింహాచలమూ వేసుకునే వాటితో పోల్చి చూస్తే ...... నిజమే...తను వేసుకునేవి మంచివిమాత్రం కావు. తనేనాడూ టెరిలిన్ బట్టలను ముట్టుకుని కూడా చూడలేదు.

అప్రయత్నంగా ఆ రోజు ... గోపాలం మెదడులోకి బాధగా గుర్తుకొచ్చింది...

ఆ రోజు ... జీతాలు వచ్చిన రోజు.

సుందరం వేసుకున్న సరికొత్త పాముకుబుసాలవంటి టెరిలిన్ బట్టలు చూస్తూంటే అటువంటివి తను కూడా వేసుకోవాలనిపించింది. ఆ కోరిక తనను విపరీతంగా వశపరచుకుంది. జీతం పట్టుకుని సరాసరి 'రవీ రెడీమేడ్' స్టోర్స్‌కి వెళ్ళాడు.

'టెరిలిన్ జత చూపించండి.'

మెర్క్యురీదీపాల మృదువైన కాంతిలో షాపువాడు బయటకు తీసిన టెరిలిన్ జత మిలమిల మెరుస్తూ అపరిమితంగా ఆకర్షించింది.

'ఎంత ?'

'నూటనలభై.'

త్రుళ్ళిపడ్డాడు గోపాలం.

జేబులో ఉన్న జీతం నూటయిరవై తొమ్మిది మాత్రమే—అని గుర్తుకొచ్చి అతను చప్పగా చల్లారిపోయాడు.

'పోనీ ఇంకా జత చూడండి. ఏభై రూపాయలే.' మరొకజత చూపించేడు షాపువాలా.

అవికూడా చాలా అద్భుతంగానే కనిపించాయ్. నిజానికవే ఎక్కువ బాగున్నాయనిపించి ఏభై రూపాయ లందించి ప్యాకెట్ తీసుకుని చీకటి పడుతూంటే తనగది చేరుకున్నాడు.

గది అంటే—ఎండ నుంచే తప్ప వాన నుంచి ఏమాత్రమూ రక్షణనీయలేని పాడుబడిన యింటి కప్పదిగువ తొమ్మిదడుగుల పొడవూ ఆరడుగుల వెడల్పూగల స్థలం. పెచ్చులూడుతూంటుంది గచ్చు. పళ్ళు పైకిపెట్టి వెక్కిరిస్తున్న భూతాల ముఖాల్లా గోడలు.

ఆ గదిలోకి రావడానికి గాలి భయపడుతుంది. వెలుతురు సంకోచిస్తుంది. నిర్భీతిగా ఆ గదిలోకి వెళ్ళగలిగింది గోపాలం ఒక్కడే. ఆగది అంటే అతనికి చాలా యిష్టం.

చాప పరుచుకున్నా కుంపటి పెట్టి వండుకుందుకు కావలసినజాగా ఉంటుంది. వంటగిన్నెలు మూడూ, కంచమూ దాచుకుందు కొక గూడుంది. ఊరికి దాదాపు మధ్యగా ఉంది కనుక ఎటుపోవాలన్నా అట్టే దూరం పోనవసరంలేదు. ఇన్ని

నడుపాయాలతో ఆ గది అద్దె ఐదు రూపాయలే! పట్నంలో యింత చవకగా మరేగది దొరుకుతుంది.? గదిమరీ పెద్దదైతే ఊడ్చుకోడం కష్టం. తన హరికేన్ దీపం మార్చుకోవాలి. ఈబాధలేమీ కలుగ ఏయని ఆ గదంటే గోపాలానికి చాలా యిష్టం.

హరికేన్‌దీపం వెలిగించి ప్యాకెట్ లోంచి బట్టలు పైకితీసి చూసుకున్నాడు గోపాలం. అతిపల్చని వెలుగులో కూడా అవి మిలమిల మెరిశాయ్ — అచ్చంగా పాము కుబుసాలకి మల్లె.

బూజులు రాలుతున్న ఆ గదిలో కొంచం నల్లగా ఉన్న తన శరీరంమీద... ఆ బట్టలు వేసుకుని చూసేడు గోపాలం.

మసకవెలుతురులో . ఒకమూల యినుప కుంపటి.. మరోకమూల బొగ్గులడబ్బా ...దండేనికి వేలాడుతున్న మాసినబట్టలు . వీటన్నిటి మధ్య కొత్తబట్టలలో తను!

గోపాలం కంపించి పోయాడు. తను పెద్దనేరం చేసినట్లు అనిపించి అతను మెల్లగా కూలబడి పోయాడు.

తనేమిటి ? తన అంతస్థేమిటి ?

ఒకజత బట్టలకోసం ఏభై రూపాయలు...

ఆ క్షణంలో అతనికి చాలా వాస్తవాలు తెలిసి రాసాగాయ్.

ఈ ఖరీదైన దుస్తులను తన నిరాడంబర దుస్తుల మధ్య ఉంచడం అన్యాయం

మనిషి బొమ్మ

ఇవి వేసుకుని తను అల్యూమినియం గిన్నెలతో కుంపటిమీద వండుకోడం అసాధ్యం

మాటిమాటికీ ఉతికితే యివి చిరిగి పోతాయ్.

అదీకాక వీటిఖరీదు ఏభై రూపాయలు! ఎందుకంత త్వరపడి ముందు చూపు లేని మూర్ఖుడైపోయాడు తను ? గడపవలసిన రోజులు ముందున్నాయని ఎలా మరిచిపోగలిగాడు తను ?

ఒకజత బట్టలకోసం ఏభై రూపాయలు ఖర్చు చేయగలిగే తాహతు తనకు లేదని ఎందుకు విస్మరించాడు ?

ఆఫీసులో అందరూ కట్టుకోవచ్చు ఒకటి రెండుసార్లు వసుంధర కూడా సూచించి ఉండవచ్చు. అయితే ? ఇది ఎగిరిగెంతి ఎత్తుకెగిరి కాళ్లు విరుచుకోడం కాదూ ?

ఏభై రూపాయలు !...కన్నీరు ముంచుకొచ్చింది గోపాలానికి.

ఆ దుస్తులు పాము పడగలలా మారి తనవంక చూస్తూ బుసలు కొడుతున్నట్టుంది.

'ఈ దుస్తులు తను వేసుకోలేదు... వేసుకుని అంతరాత్మఘోష భరించలేడు. తను చాలా మూర్ఖుడైపోయాడు.'

త్వరత్వరగా వాటిని ప్యాకెట్‌లో పెట్టి షాపుకి పరుగెత్తాడు.

'ఇవి వాపస్ తీసుకోండి—' రొప్పుతూ అందించాడు పాకెట్.

'ఉహూఁ...' తిరస్కరించాడు షాపు యజమాని.

ప్రపంచం యావత్తూ అంధకారమయమై పోయింది. ఆపాదమస్తకమూ కంపించి పోసాగాడు గోపాలం. అతనికళ్ల వెంట నీరు కారడం ప్రారంభించింది. ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆపుకోలేక పోతున్నాడు.

'నేను మూర్ఖుణ్ణి. పిచ్చివాడిని... ఇంతమంచి బట్టలు వేసుకునే అర్హత నాకులేదు. దయచేసి వీటిని తీసేసుకుని నాడబ్బు నా కిప్పించండి. లేకపోతే నెల్లాళ్లు పస్తుండవలసి వస్తుంది. క్షమించి సీటిని తీసుకోరూ ?!'

రుద్ధకంఠంతో ప్రార్థిస్తున్న గోపాలాన్ని చూసి—'పిచ్చివాడిలా ఉన్నాడని గొణుక్కుంటూ ప్యాకెట్ తీసుకుని అర్ధరూపాయి తగ్గించి అతని డబ్బు వాపస్ చేశాడు షాపతను.

గది చేరుకుని గోపాలం మనసు తేలికపడేలా కన్నీరు కార్చేడు.

తన పొరపాటుకి శిక్ష అర్ధరూపాయి! ఇంకెప్పుడూ తొందరపడి క్షణిక బలహీనతలకూ సరదాలకీ లోబడకూడదు—

అలా బుద్ధిచెప్పుకుని ఆ రాత్రి పస్తుండి తననుతానే శిక్షించుకున్నాడు గోపాలం.

'ఎందుకయ్యా ఆ దిష్టిబొమ్మగురించి ఎగ్జైము వేస్టు చేస్తారు ? ఆ మాసిన గుడ్డలూ, నలిగిన చెప్పులూ మనకి శ్రీరామరక్ష. గుమాస్తా స్థితిని గుర్తు చేస్తూ అటివంటి స్పెసిమిన్ ఒకటుండడం మనకీ మంచిదే. అతన్ని చూసి మనం గర్వపడుతూ ఉండవచ్చు.'

దిష్టిబొమ్మ! గోపాలం మనసులో బాణం గ్రుచ్చుకుంది.

తను దిష్టిబొమ్మా ? వాళ్లకి మల్లె ఖరీదైన బట్టలు వేసుకోనంత మాత్రాన, ఆడంబరాలకి పోనంతమాత్రాన తనుమనిషి కాకుండా దిష్టి బొమ్మ ఐపోతాడా ? నిజమే. తను రంగులు పూయని మట్టిబొమ్మ... అయితేమాత్రం... వారు తనని చూసి జాలిపడాలికాని యిలా హేళన చేయడం ఏం న్యాయం ?

ఆయన కంటె నేను ముందొచ్చేను తెలుసునా?

నిజంగా వాళ్లకు తెలియదూ తనీ గదిలో ఉన్నాడనీ వారి మాటలు విని 'తను బాధపడతాడనీ ?

'ఒక విషయం తెలుసా మీకు ?'

గోపాలంగుండెలు ఆత్రుతగా భయంగా కొట్టుకున్నాయి.

'మనవాడు శ్రమజీవి. తన వంట తనే వండుకుంటాడు. ఫర్లాంగు దూరం నుంచి నీళ్ళు తెచ్చుకుంటాడు. తన గుడ్డలు తనే ...'

'గాంధీ మహాత్ముడిలా ఐపోవాలని కాబోలు !'

ఒక్కసారి అయిదారు గొంతుకల నవ్వుల పరంపర !

గోపాలం గుండెల్లో బాణాల పరంపర. భరించలేక పోయాడు.

భగవాన్...తనపై వాళ్ళందరికీ ఎందుకింత పగ ? వాచా మనసా కర్మణా తను వారికే అపకారమూ చెయ్యలేదే !

తనని హేళనచేసి వారు పొందే ఆనంద మేమిటి ?

దిష్టిబొమ్మ... ఒంటిగొట్టు రామలింగడు... షైలాక్... లుబ్ధావధానులు ... యిన్ని బిరుదాలు ప్రసాదించారు. ఇంకా తృప్తి తీరకనేనా యిలా తనవంక గురిచూసి వాగ్బాణాలు విసురుతున్నారు ?

తన హృదయాన్ని చిత్రవధచేసి వారు పొందే లాభమేమిటి ?

తను ఒక మనిషి. తన కొక బ్రతుకుంది. అది వాళ్లకళ్లకు కొంచెం చిత్రంగాను కనిపించవచ్చు. అంత మాత్రాన తన నింత నిర్దయగా శిక్షించడం వారికి న్యాయమేనా ? తన జీవిత వైఖరిని వాళ్ళెందు కసహ్యించుకోవాలి ? మాటలు విని మనసులో బాధపడకుండా ఉండగలగడానికి తను మరబొమ్మ కాదు. ఇవి ఎందుకు గ్రహించరా క్రూరాత్ములు ?

వాళ్లకి తనమీద శత్రుత్వం. కారణం— తను ఒంటరిగా మిగిలిపోయాడు వారితో స్నేహం చేయకుండా.

తనకు స్నేహితులు కావాలి. స్నేహంలోని మాధుర్యం తనకి తెలుసు. కాని — తను కోరుకునే స్నేహం వాళ్లివ్వరు. ఇవ్వలేరు. తనుకోరే స్నేహంలో చాలా స్వార్థం ఉంది. స్నేహితులకోసం కాఫీ లివ్వడంవంటి చిన్న చిన్న త్యాగాలు కూడా చెయ్యలేదు తను. స్నేహితులని తన గదికి ఆహ్వానించలేదు. వారికి తనపట్లకానీ తన



ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు

ఆరోగ్య సౌభాగ్యములకు ఆధారపడునది లోధ్ర

66 సంవత్సరములపైగా ప్రసిద్ధినొందినది

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్

రాయపేట, మద్రాసు-14

ఏజెంట్లు

సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)

విజయవాడ-సికింద్రాబాదు-మధుర-బరహంపురం-బెంగుళూరు

టెరిలిన్ వస్త్రములు

టెరిలిన్ పాంటు మరియు షర్టు వస్త్రములు (1.25 & 2.25 మీ.) రెండును క్లియరెన్సు ధర రు. 28 50 లకే అమ్మబడును. V.P.P ఛార్జీలు రు.2.50అదనం

ARVIND AGENCIES (APW-40)

P. O. Box 1408, Delhi-6.

రు. 20/-లకు ట్రాన్సిస్టర్

మిక్కిలి సరసమైన ధరలలో కొ అనే టిప్ పద్ధతిపైన రు. 20/-లకే సరి కొత్త ఆల్‌వరల్డ్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్‌ను పొందండి. వి.పి.ఆర్డరు ఇంగ్లీషులో నేడే వ్రాయండి.

CEYLON TRADERS

(WAP-22)

Post Box 1257, DELHI-6.

మనిషి బొమ్మ

జీవితంపట్లకానీ ఏమాత్రం కుతూహలమూ ఉండకూడదు. ఇన్ని పరిధులు తన స్నేహానికి! ఈ పరిధులలో ఎవరూ ఉండరని తనకి తెలుసు. అందుకే హృదయం ఎంత ఆరాటపడినా తనెవరినీ స్నేహితులుగా ఆహ్వానించలేకపోయాడు. అందుకే తోటి గుమాస్తాలదృష్టిలో తను ఒంటిగొట్టు రామలింగడు.

'మురికిగుడ్డలు వేసుకుంటాడనీ, ఎవరితో మాట్లాడడనీ గోపాలం గురించి బుద్ధిమంతుడని అపోహపడ నవసరం లేదు.'

'ఏమిటి నువ్వనేది?'

పడబోతున్న పిడుగేమిటా అని తల్లడిల్లుతూ తలెత్తాడు గోపాలం.

'గాంధీ బొమ్మపక్క ఎర్రమేడ ఎందుకు ప్రసిద్ధో మీకు తెలుసుగా?'

'ఆహా! అర్ధరూపాయనుంచి అయిదు రూపాయలకూ ఆటబొమ్మలు— ప్రాణమున్న ఆడబొమ్మలు దొరుకుతాయ్.'

'ఇదిగో ఈ ఉడత గోపాలం—పద్దెనిమిదేండ్ల పుత్తడిబొమ్మ నోదాన్ని ప్రియురాలిగా చేసుకున్నాడు. ఆమెను మనవాడు మోహించాడు. ప్రతిసాయంత్రం ఆరు గంటలకి అక్కడికిపోతాడు. తిరిగి వస్తూండగా నేనెన్నడూ చూడలేదు—'

'వసుంధరా!' జాలిగా అనుకున్నాడు గోపాలం. అతని ముఖం ఎర్రబడిపోయింది. నా కారణంగా నువ్వు వీళ్ల నోళ్లల్లో నీచంగా నలుగుతున్నావ్ నన్ను క్షమించు. వీళ్ళు మనుషులుకారు. నిన్నూ నన్నూ అర్థంచేసుకుని ఆమోదించగలిగే ఔన్నత్యం వీరిలో లేదు. వీళ్లెప్పుడూ రంగుటద్దాలలోంచే చూడగలరు. వీరికి కళ్లేకాని మనసులేదు.

వీళ్లేమన్నయినా అననీ. నిజం నాకు తెలుసు. ఈ పట్నంలో నన్ను గౌరవించేదీ ఆదరించేదీ నువ్వే. ఏ ఆశయం కోసం నువ్వు నాకు చేరువయ్యావో అది నెరవేరేదాకా నిన్ను దూరం చేసుకోను.'

'ఆ సుఖాన్ని కొనుక్కొందుకు మన గోపాలం ఎన్ని అవతారాలెత్తుతాడో తెలుసా? ఉదయం ఏడునుంచి తొమ్మిది వరకూ శ్రీ ప్రెస్‌లో కంపోజింగ్ చేస్తాడు. వెలకి నలభై యిస్తారుట.'

'శ్రీలా మహల్‌లో రెండవ ఆటకి బుకింగ్‌లో కూర్చుంటాడు. రెండుపొర్లు నాకే టిక్కట్లమ్మాడు. వాళ్లూ ఏ పాతికో ముప్ఫయ్యో యివ్వకపోరు.'

'ఎన్ని అవతారాలెత్తితే ఏం? నదులన్నీ సముద్రంలో కలిసినట్లు ఇతనార్జించినదంతా ఆ ఎర్రమేడ పాలేగా!

సరిగా తిండితినడు. శుభ్రమైన బట్ట కట్టడు. ఆర్జించేదంతా ఆ సానిపాపకు సమర్పించడమేగా.

అదుపులోపెట్టడానికమ్మా నాన్నా లేరు. వాళ్లకి తెలిస్తే—ఎంతబాధ పడలారో లుగా తుచ్ఛుడిగురించి.'

ఇక భరించలేకపోయాడు గోపాలం.

వాళ్లముందుకువెళ్లి ఏదో చేసెయ్యాలన్న ఉద్రేకంతో లేచి నిలబడ్డాడు. కాని—మరుక్షణం గుర్తుకొచ్చింది — వాళ్లంతా ఒకటి. తనొకడు ఎదిరించినా ప్రయోజనముండదని.

సెలవు కోరుకుంటూ లీవ్ లెటరు రాసి హెడ్‌క్లర్కుకిచ్చి గదికి బయల్దేరాడు. ఆ గదిలో ఎన్ని అసౌఖ్యాలున్నా పుష్కలంగా ఏకాంతం లభిస్తుంది. తలుపులు తీస్తూనే వెళ్లి చాపమీద వాలిపోయాడు.

ఏకాంతం లభించగానే అతని దుఃఖం యినుమడించింది. హృదయానికి తగిలిన ఘాతాలకు సాంత్వన కలిగించాలని కన్నీరు కట్టలు తెంచుకోసాగింది.

తనవంటి నికృష్టజీవి, నిర్భాగ్యుడూ ఇంకెవరూ ఉండరనిపించిందతనికి. ఒంటరిగా యావత్ప్రపంచాన్ని ఎదుర్కోడం అసాధ్యమనిపించింది. ఒక్కసారి తన జీవితం జ్ఞాపకంవచ్చి అతని విషాదం వేయిరెట్లయింది. తల గోడకేసి బాదుకోవాలన్నంత ఉద్రేకం...ఏదో నిస్పృహ... అంతులేని నిరాశ...అన్నీ ఒక్కుమ్మడిగా అతన్ని చుట్టుముట్టాయ్. సరిగ్గా ఆ క్షణంలో...

'గోపాలం' ఎక్కడినుంచో మెల్లగా పిలుపు.

తలెత్తి చూశాడతను.

కళ్లకెదురుగా హుందాగా నిలుచున్నాడు ఊహామూర్తి గోపాలరావ్. ఖరీదైన కారులో...టెరిలిన్ సూట్ వేసు

కుని—కళ్ళనిండా కాంతి నింపుకుని— పది మందీ చూసి ఈర్ష్యపడేంత గొప్పగా ఉన్నాడు గోపాలరావ్.

అతని కన్నులు జాలి కురిపిస్తున్నయ్ గోపాలంమీద.

'ఇలా చూడు గోపాలం.'

గోపాలం చూడలేదు. తలవంచుకున్నాడు.

మామూలుగా అయితే తనలోని ఊహామూర్తి కనుపించేసరికి గోపాలం ఉత్సాహభరితుడయ్యేవాడు. కాని— ఈ క్షణాల్లో అతనూ గోపాలాన్నేమాత్రమూ ఊరడించలేకపోతున్నాడు.

'నేను గోపాలం...నీ ఏకైక మిత్రుడిని. నన్ను నిర్లక్ష్యం చేస్తావా? నీ ఆశలూ ఆశయాలూ అన్నీ నేనేకద? నన్నే మరిచిపోయావా? అటుచూడు. ఆ గోడమీద గొంగళి పురుగు పాకుతూంది. ప్రస్తుతం ప్రపంచంచేత అపరిమితంగా అసహ్యించుకోబడే ఆ పురుగే అతిత్వరలో గూడు కట్టుకుని సమాధిలో ఉంటుంది కొన్నాళ్ళపాటు. తరువాత? సమయం చూసుకుని గూడు చించుకుని బయట పడుతుంది. అప్పటికది గొంగళి పురుగు నుంచి సీతాకోక చిలుకగా పరిణామం చెందుతుంది.

గొంగళిపురుగు అసహ్యకరమైన రూపానికీ సీతాకోకచిలుక రంగు రంగుల రెక్కలలోని ఆకర్షణకీ ఎంత వ్యత్యాసం? ఈ వ్యత్యాసం కలిగించినది కాలం! ఆలోచించు గోపాలం...నేను చెప్పినది నిజమేనా, కాదా?

ఈనాడు నువ్వింకా, కోశదశలోనే ఉన్నావు కనుక తాత్కాలికమైన కష్టాలు కొన్ని భరించక తప్పదు. సీతాకోక చిలుక అవాలంటే గొంగళి పురుగుదశ అనుభవించక తప్పదు.

ఓ మనిషీ!...కొన్నాళ్ళు ఏ అనుభూతులూ పట్టించుకోకుండా బొమ్మలా బ్రతికితే-భవిష్యత్తు బంగారమవౌతుంది. ఈనాడు నలుగురిచేతా చిన్నచూపు చూడబడే నీవే—కాలక్రమాన నలుగురూ ఈర్ష్యపడేంత గొప్పవాడి వౌతావ్.

నీ జీవితమంతా ముందే ఉంది. ఇక లే...నీ విచారాన్నవతలకు నెట్టిపారేసి భవిష్యత్తుకోసం వర్తమానంలో నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని గుర్తు తెచ్చుకో.'

గోపాలం తలెత్తి చూసేసరికి అతనిలోని ఊహామూర్తి గోపాలరావ్, ఇంతవరకూ హితబోధచేసిన శ్రేయోభిలాషి అదృశ్యమైపోయాడు.

అతని కంటికెదురుగా పాతడైరీ సాక్షాత్కరించింది బట్టల పెట్టెమీద నుంచి;

అతను లేచి ఆ డైరీ అందుకుని మెల్లగా పేజీలు తిప్పుతూంటే పాత ఉత్తరం జారిపడింది.

ఒక్కసారి దానివంక చూసేడు.

తను ఉద్యోగంలో చేరిన మూడవ రోజున అందిన ఆ ఉత్తరం—ఉద్యోగంలో చేరుతూ తనుకన్న రంగు రంగుల కలలన్నిటిని అంత మొందించి-తనకు కళ్ళు తెరిపించిన ఆ ఉత్తరం—భారంగా చదువుకోసాగాడు గోపాలం,

'చిరంజీవి గోపీ!

ఈపాటికి ఉద్యోగంలో చేరిఉంటావు. ఆ విషయం వెంటనే వ్రాయి. నీ గురించి యిక్కడ మేమంతా ఆత్రుతగా ఉంటామని మరిచిపోకు. ఒకవిషయం—ఇన్నాళ్ళా ముఖాముఖీ నీకు చెప్పనిది—రాస్తున్నా నీ ఉత్తరంలో. బహుశా ఏ తండ్రీ కొడుక్కి యిలా వ్రాయవలసినంత దిగజారి ఉండదేమో! అంత దురదృష్టవంతుడు నేను తప్ప మరెవరూ ఉండరనే నా విశ్వాసం.

అప్పులూ—ఆస్థీ ఏమీలేకుండా ఎలిమెంటరీ మేష్టరి గిరితో మీ నాన్న జీవితం ప్రారంభమైంది. ఉద్యోగం ఎటువంటిదో నువ్వు ఊహించగలవ్. తాత్కాలికావసరాలూ...సుఖాలూ వీటి ప్రభావంతో నేను భవిష్యత్తుగురించి ఏమాత్రమూ ఆలోచించలేకపోయానని యిప్పుడు చాలా చింతిస్తున్నాను. కాని ప్రయోజనమేమిటి?

ఉద్యోగంనుంచి విశ్రాంతి యిచ్చేసింది ప్రభుత్వం. జీవితంనుంచి మాత్రం విశ్రాంతి లేదు. నా అప్రయోజకత్వం కారణంగానే ఎంత బుద్ధిమంతుడివైనా చురుకైన వాడివైనా నిన్ను పై చదువులకి పంపలేక ఎదుగూ బొదుగూ లేని గుమాస్తా ఉద్యోగానికి పంపేను ఎంత మనస్కరించకపోయినా.

ముప్ఫయ్ రూపాయల పెన్షన్‌తో కుటుంబం గడపడం అసాధ్యమైనప్పుడు నిన్నింకేం చదివించేది?

నువ్వు...తమ్ముడు...చెల్లెలు...అనారోగ్యంతో బాధపడుతున్న మీ అమ్మ—మీ నలుగురూ నేను పరిష్కరించలేని సమస్యలే ఐపోయారు.

నిన్నూ తమ్ముడినీ తలుచుకుంటే ఒక వంక ఆనందం - మరొకవంక బాధ. మీ భవిష్యత్తుకి నేనేం చేయగలను?

నువ్వు నిజంగా దురదృష్టవంతుడివి గోపీ! అందుకే పెద్దకొడుకుగా పుట్టావు. కొన్ని సంవత్సరాలు ముందుకానీ వెనుకకానీ జన్మిస్తే నీ జాతకం ఎలా ఉండేదో?



వయసుతో వంగిపోయిన నా భుజాలింక యీ భారాలని మోయలేని స్థితికి వచ్చేశాయి. కొంతగా కొంత నువ్వూ ప్రయోజకుడి వయ్యావు. తండ్రి తరువాత కుటుంబ భారం మోయవలసింది పెద్ద కొడుకే.

నీకోసం సుఖాలను సిద్ధపరచడం పోయి—సమస్యలనే వదిలిపెడుతున్నాను. ఇది అసమర్థతా అన్యాయమూ అని తెలిసినా—అనివార్యమే అయింది. నాకు తెలుసు. నా చేతులారా నేనే నీ భవిష్య ద్విహంగపు రెక్కలను కత్తిరిస్తున్నానని. కాని—ఏంచేయగలను?

నీముందు నేను విడచిపెడుతున్నవి నాలుగు సమస్యలు.

నీ తమ్ముడి చదువు, నీ చెల్లెలిపెళ్ళి... మీ అమ్మ అనారోగ్యం...ఏ క్షణంలోనైనా నేను హఠాత్తుగా కన్నుమూస్తే యావత్ కుటుంబ భారాన్ని నీ భుజస్కంధాలపై వహించడం. ఈ కుటుంబం ఉద్ధరించబడటమంటూ జరిగితే అది కేవలం నీ ప్రయోజకత్వంవల్లనే కావాలి. అందుచేత నువ్వే నీ కర్తవ్యాన్ని నిర్ణయించుకో.

మీ నాన్నను నలుగురూ వేదాంతి అంటారు కదూ! వాళ్ళకి నిజం తెలియదు- నా వేదాంతానికి పునాది అసమర్థతే అని.

ఒకమాట బాబూ...నీపై నాకు చాలా ఆశలున్నాయ్.

మనిషి బొమ్మ

నువ్వు కులదీపకుడివౌతావ్. కొన్నాళ్ళపాటు నేను వదిలిన సమస్యలు నిన్ను నలువైపులా బంధించినా త్వరలోనే వీటిని సమర్థవంతంగా పరిష్కరించగలవ్. అంతవరకూ నీ జీవితంలో కొంత చీకటి భరించక తప్పదు.

నాకు తెలుసు బాబూ...ఈ క్షణాల్లో నీ జీవితం గాలిపటంలా పైకెగిరిపోవాలని కోరుకుంటూ ఉంటుందని. కాని గాలిపటం సక్రమంగా ఎగరాలంటే దానికి కట్టిన దారం చాలా అవసరం.

ఇప్పటికే సుదీర్ఘమైన ఉత్తరం వ్రాసేను. సన్నర్థంచేసుకో బాబూ. తరచుగా నీక్షేమం వ్రాస్తూ ఉండు. ఈ కోరికల్లోమాత్రం స్వార్థంలేదు బాబూ... అంతా పితృవాత్సల్యమే. అపార్థం చేసుకోవు కదూ?

మీనాన్న...పార్వతీశం.'

కొన్నిక్షణాలపాటు శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు గోపాలం.

దూరంగా గడియారం ఆరుగంటలు కొట్టింది.

'మాస్టారూ! పరీక్షలుదగ్గర పడుతున్నాయ్.. మీ రొక్కరోజు పాఠం మానేసినా నేను పరీక్ష ప్యాసుకాలేను. అప్పుడు నాకీ నరకం మరింత తప్పనిసరవుతుంది... త్వరగా రండి మాస్టారూ ... నా ఆశలూ ఆశయాలూ వృథా చేయకండి. నా పతిత జీవితాన్ని ఉద్ధరించండి—' అంటూ వసుంధర కన్నీటితో పిలిచినట్లయి హఠాత్తుగా లేచి కళ్ళు తుడుకుని బట్టలు వేసుకోసాగాడు గోపాలం.

ఆ ఉత్తరాన్ని తిరిగి డైరీలో భద్రపరుస్తూ తనలోతానే అనుకున్నాడు.

'నాన్నా! నువ్వప్పగించిన కర్తవ్యాలు సరిగ్గానే నెరవేరుస్తున్నాను. నెలనెలా డెబ్బయ్‌రూపాయలు జీతంలోంచి పంపుతున్నాను, అదవ్వైతో నా జీవితం సుఖంగానే గడుస్తోంది.

ప్రెస్‌వాళ్ళిచ్చే నలభై చెల్లెలిపేర బ్యాంకులో వేస్తున్నాను, పెళ్ళికి ఉపయోగిస్తుందని.

సినిమాహాలు వాళ్ళిచ్చే పాతిక రూపాయలూ తమ్ముడి కాలేజీ చదువుకని వేరే బ్యాంకులో వేస్తున్నాను వాడిపేర.

వసుంధరకి ప్రైవేటు చెపుతున్నాను నాన్నా. వేశ్యావృత్తి ఆమెకెంతమాత్రమూ యిష్టంలేదు. మెట్రిక్ పాసై—ఏదైనా ఉద్యోగం చూసుకుని గౌరవనీయమైన జీవితం గడపాలని ఆమె ఆశయం. అందుకే నలుగురూ నన్నపార్థం చేసుకుంటున్నా ఆమెకి ట్యూషన్ చెప్పి— ఆమెయిచ్చే జీవితం అమ్మమందులకని పంపిస్తున్నాను.

ఏం నాన్నా, నేను నా కర్తవ్యాలని సరిగ్గా నిర్వర్తిస్తున్నానా?

నా ధ్యేయమల్లా ఒక్కటే. నువ్వు ప్రశాంతంగా గడపాలి నీ వృద్ధాప్యం. గతం తలుచుకుని నువ్వు విచారించకూడదు.

నాకు తెలుసు నాన్నా, నా జీవితం త్వరలో మలుపు తిరుగుతుంది. అప్పుడింకా ఎన్ని సమస్యలనైనా అతి సులభంలా ఎదుర్కొగలను. అంతవరకూ— నేను బొమ్మనే నాన్నా, ఎవరి విమర్శలూ నన్ను బాధించవు. ఏ కష్టనష్టాలూ నన్ను చలింపజేయవు.

కర్తవ్య నిర్వహణ కలిగించే తృప్తి ముందే కష్టాలైనా తీసికట్టే, అనుభవం మీద గ్రహిస్తున్నాను నాన్నా యీ జీవిత సత్యాన్ని.'

తలుపువేసి—ఎర్రమేడకి బయలుదేరాడు గోపాలం. అతని అడుగులు అతి తేలికగా సాగిపోతున్నాయ్.